
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ׀ 15 ׀ సెప్టెంబర్ ׀ 2025



32,971 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సోమశిల: జలాశయానికి 32,971 క్యూసెక్కుల వరద ప్రవాహం పెరిగింది. జలాశయంలో 74.800 టీఎంసీల నీరు నిల్వ ఉంది. క్రస్ట్‌గేట్ల ద్వారా 30 వేలు, ఉత్తరకాలువకు 4 వేలు, కండలేరుకు 10,350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,12,,950
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,190
3శాతం జీఎస్టీతో	రూ.10,496
సవర (8 గ్రా)	రూ.83,968

గరిష్ఠం/కనిష్ఠం 36.8 /27.0

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ ఉరుములు, మెరుపుల వాతావరణం ఉంటుంది. ఆదివారం గాలిలో తేమ 66 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కబడ్డీ జట్టు ఎంపికలు నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా బాలుర, బాలికల జూనియర్ కబడ్డీ జట్టు ఎంపికలను సోమవారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గంటా సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ జరగాల్సిన ఈ ఎంపికలను వర్షాల కారణంగా వాయిదా వేశామని తెలిపారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన వారు ఈ నెల 22వ తేదీ నుంచి ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే 51వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. ఇతర వివరాలకు 7278555777 నంబరులో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో కృష్ణతేజ అతిథిగృహం వరకు భక్తులు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 82,149 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 36,149 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.85 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

పెన్నకు వరద విడుదల

• గంగమ్మకు సారే సమర్పించిన ఆనం



స్విచ్ఛాన్ చేసి విడుదల చేస్తున్న మంత్రి ఆనం

సోమశిల: జలాశయం నుంచి 5, 6 గేట్ల ద్వారా ఆదివారం మంత్రి ఆనం పెన్నానదికి నీటిని విడుదల చేసి గంగమ్మకు జలహారతి ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ వరద జలాలు రావడంతో జలాశయం సామర్థ్యం వరకు నీటిని నిల్వ చేసి, మిగులు జలాలను పెన్నానదికి వదలం జరుగుతుందన్నారు. టెంపుల్ టూరిజం పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆనం చెప్పారు. సోమశిల నుంచి ఏసీఆర్ కెనాల్ ద్వారా మర్రిపాడు, వింజమూరు దుత్తలూరుకు నీటిని అందజేసే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం పలు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని గిరిజన గురుకుల పాఠశాలలను సందర్శించి మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆత్మకూరు గురుకుల పాఠశాలలో ప్రబలిన జ్వరాలను దృష్టిలో ఉంచుకొని వైద్య, ఆరోగ్య, రెవెన్యూ సమన్వయంగా పనిచేస్తూ విద్యార్థుల విషయంలో జాగ్రత్తలు తీసుకుని పాఠశాలలో శానిటేషన్ చేయించాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న సోమేశ్వరాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవచౌదరి, సోమశిల ప్రాజెక్ట్ ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి పావని, డీఎస్పీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

'సాక్షి'పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి



ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడే పత్రిక వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టడం దారుణం. ప్రభుత్వ వైఫల్యాలను, మోసాలను వెలుగులోకి తెస్తున్నారన్న కోపంతో 'సాక్షి' పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డితోపాటు ఇతర విలేకరులపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి. ప్రజాస్వామ్యంలో పత్రికలపై కేసులు పెట్టడం మంచి సంప్రదాయం కాదు. పత్రికా వ్యవస్థను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. పాలకులకు నచ్చని వార్తలొస్తే ఖండన ఇవ్వొచ్చు. అంతేకానీ ఇలా వరుసగా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యంలో మంచి పరిణామం కాదు.

– జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు




పత్రికలు ప్రజా గొంతుకలు



ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆధారమైన నాలుగు స్తంభాల్లో ఒకటైన మీడియాలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రజల గొంతుకలై వ్యవహరించే 'సాక్షి' పత్రిక ఎడిటర్, జర్నలిస్టులపై ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయిస్తూ వ్యవహరిస్తున్న తీరు, నోరు నొక్కడానికి పోలీస్ యంత్రాగాన్ని వినియోగిస్తున్న విధానం అప్రజాస్వామికం. ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య వారధులుగా పత్రికలు పని చేస్తాయి. ప్రభుత్వంలో జరిగే తప్పొప్పులు పత్రికలు ఎత్తి చూపుతాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాశారని 'సాక్షి' పత్రికపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 'సాక్షి' మీడియాను పోలీసులను అడ్డం పెట్టుకుని దాడులను ప్రోత్సహించడం, మీడియాను అణచివేయడానికి చూడడం హేయమైన చర్య.

– మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త

వైరల్ ఫీవర్రీ



జిల్లాలో వైద్య శాఖ నిర్లక్ష్యం, ప్రభుత్వ నిర్లిప్తత వెరసి ఫీవర్ వైరల్ అవుతోంది. కొన్ని రోజులుగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు, మరో వైపు విజృంభిస్తున్న దోమల కారణంగా టైఫాయిడ్, డెంగీ మలేరియా, ఫ్లూ వంటి విషజ్వరాలు ప్రబలి ప్రజలు విలవిలలాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. అయితే జ్వరాలు నియంత్రణలోనే ఉన్నాయంటూ వైద్యాధికారులు బుకాయిస్తున్నారు. ఇంటింటికి ఇద్దరు.. ముగ్గురు లెక్కన జ్వర పీడితులు రోజురోజుకు పెరుగుతున్నారు. కూటమి ప్రభుత్వంలో వైద్యం సక్రమంగా అందక, మరో వైపు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రకరకాల పరీక్షల పేరుతో వేలకు వేలు గుంజుతుండడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మకూరులో గురుకుల పాఠశాలలో 40 మంది విద్యార్థినులు జ్వరాల బారిన పడడంతో అధికార యంత్రాంగం ఉలికిపడి హడావుడి చేస్తోంది.





పెద్దాస్పత్రిలో ఓపీ కోసం వేచి ఉన్న రోగులు

- జిల్లాలో ఇంటికి ఇద్దరు, ముగ్గురు జ్వర పీడితులు
- రోగులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల కిటకిట
- పరీక్షల పేరుతో రూ.వేలు గుంజుతున్న వైద్యశాలలు
- నియంత్రణ చర్యలు చేపట్టని వైద్యశాఖ
- ఆత్మకూరు గురుకుల ఘటనతో ఒక్కసారిగా ఉలికిపాటు

నెల్లూరు (అర్బన్): ప్రపంచాన్నే వణించిన 'కరోనా'నే సమర్థవంతంగా ఎదుర్కొన్న ప్రభుత్వ వైద్య వ్యవస్థ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వీర్యమైపోయింది. విష జ్వరాలతోపాటు డయేరియా వంటి సాధారణ రోగాలను సైతం కట్టడి చేయలేక చతికల పడింది. వైఎస్సార్‌సీపీ హయాంలో సబ్ సెంటర్ల స్థాయి నుంచి జిల్లా పెద్దాస్పత్రి వరకు ప్రభుత్వ వైద్యం కార్పొరేట్ తలదన్నే రీతిలో అందింది. వర్షాలు ప్రారంభమైనప్పుడే వైద్య వ్యవస్థను అప్రమత్తం చేసి ఇంటింటా సర్వే చేపట్టింది. జ్వరపీడితులు ఉంటే తక్షణమే చర్యలు చేపట్టింది. అటువంటిది కూటమి పాలనలో వైద్యం పూర్తిగా పడకేసింది. జిల్లాలో 52 పీహెచ్‌సీలు, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఒక జిల్లా ఆస్పత్రి, రెండు ఏరియా ఆస్పత్రులు, నెల్లూరు నగరంలో ఒక సర్వజన ఆస్పత్రి ఉన్నాయి. ఇవి కాక సుమారు 450 ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు ఉన్నాయి. నెల రోజుల క్రితం వరకు ప్రభుత్వ ఆస్పత్రులకు రోజుకు సుమారు 8 వేల మంది వరకు ఓపీ ఉంటే.. ప్రస్తుతం ఆ సంఖ్య 15 వేలకు పెరిగింది. ఇందులో 10 నుంచి 15 శాతం జ్వర పీడితులే ఉన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రిల్లో మరో 15 వేల మంది రోగులు వచ్చేవారు. వీటిలో రోజుకు 25 వేలకిపైగా ఓపీ కేసులు పెరిగాయి. ఇందులో కూడా సుమారు 15 శాతానికి పైగా జ్వరపీడితులే ఉండటం విశేషం. గత వారంలో నెల్లూరు సర్వజన ఆస్పత్రిలో ఓపీ సంఖ్య సుమారు 1100 వరకు ఉంటే.. సోమవారం పరిశీలించగా ఓపీ రోగుల సంఖ్య 1600 వరకు పెరిగింది. ఓ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలిస్తే గత వారంలో ఓపీ 800 నుంచి 900 వరకు ఉంటే.. ఇప్పుడు ఆ సంఖ్య 1400 వరకు పెరిగింది. వీరిలో ఎక్కువ మంది టైఫాయిడ్, డెంగీ, వైరల్ ఫీవర్ వంటి జ్వర పీడితులే అధికంగా ఉన్నారు. మరో ప్రైవేట్ ఆస్పత్రిని పరిశీలిస్తే అక్కడ కూడా 800 ఓపీ ఉండే రోగుల సంఖ్య ఈ వారంలో 1200 మందికి చేరింది.

నాడీ పట్టరు.. బీపీ చూడరు

జ్వరాలతో నీరసించి ప్రభుత్వ ఆస్పత్రులలకు వెళ్తే పలువురు డాక్టర్లు కనీసం చేయి పట్టుకుని నాడి ఎలా కొట్టుకుంటుందో కూడా చూడడం లేదని, బీపీ చెక్ చేయడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. జ్వరం అని చెప్పగానే మాత్రలు రాసిస్తున్నారని, ఫార్మసీ దగ్గరకు వెళ్తే ఒక రకం మందు ఉంటే మరో రకం మందు ఉండడం లేదంటున్నారు. రక్త పరీక్షలు కూడా అరకొర మందికి చేస్తూ.. మిగతా వారికి మాత్రలు రాసిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

బోగస్ లెక్కలు.. బుకాయింపులు

ప్రతి ప్రైవేట్ వైద్యశాలలో తరచూ డెంగీ, మలేరియా కేసులు నమోదవుతున్నాయి. అయితే డెంగీకి సంబంధించి ప్రైవేట్ వైద్యశాలల్లో చేసే ఎన్‌ఎస్1 వంటి పరీక్షలను వైద్యశాఖ అంగీకరించడం లేదు. ప్రభుత్వ వైద్యశాలలో చేసే పరీక్షలు చేయించుకుని పాజిటివ్ వస్తేనే డెంగీగా గుర్తిస్తున్నారు. ఇలాంటి పరీక్షలు పీహెచ్‌సీల్లో చేయడం లేదు. అయితే వైద్యశాఖ బోగస్ లెక్కలతో బుకాయింపులు చేస్తోంది. జిల్లాలో గతేడాది డెంగీ కేసులు 130 , మలేరియా కేసులు 6, చికున్ గన్యా 2 నమోదైనట్లు చూపిస్తే.. ఇప్పటి వరకు 20 డెంగీ కేసులు, 3 మలేరియా కేసులు, 2 చికున్ గన్యా కేసులు వచ్చినట్లు చూపుతున్నారు.



పెద్దాస్పత్రి వార్డులో అడ్మిట్ అయిన రోగులు

గొంతునొప్పి, జ్వరం, జలుబు, దగ్గు కేసులే ఎక్కువ

మారిన వాతావరణం నేపథ్యంలో గొంతు నొప్పి, జ్వరం, జలుబు, దగ్గు, వళ్లు నొప్పులు వంటి లక్షణాలతో ఎక్కువగా రోగులు వస్తున్నారు. వైరల్ జ్వరాలతోపాటు టైఫాయిడ్, జాండిస్, డెంగీ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. జ్వరం వస్తే ఐదు రోజుల నుంచి వారం రోజుల పాటు తగ్గడం లేదని రోగులు పేర్కొంటున్నారు. జ్వరం వస్తే వారం రోజులు వదలడం లేదు. విపరీతమైన నీరసం, ఒళ్లు నొప్పులు, తలనొప్పితోపాటు జ్వరం వస్తోంది. దీంతో డాక్టర్ల వద్దకు పరుగెడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిగా పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ బాట పడుతున్నారు. ప్రైవేట్ డాక్టర్ల వద్దకు పోతే టెస్ట్‌లకే రూ.1500 అవుతుంటే.. మందులకు మరో రూ.1000 వెయ్యి, డాక్టర్ ఫీజు, ఇతర ఖర్చులకు రూ.800 నుంచి రూ.1000 వరకు అవుతోంది. జ్వరాలు పూర్తిగా నయం అయ్యే సరికి రూ.10 వేల వరకు ఖర్చవుతుందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మందులు పూర్తిగా ఇవ్వడం లేదు

ఆరోగ్యం బాగా లేక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే అక్కడ మేము చెప్పేది కూడా పూర్తిగా వినకుండానే మందులు రాసిస్తున్నారు. ఆ మందులు కూడా అన్ని దొరకడం లేదు. కొన్ని బయట కొనుక్కోమంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డబ్బులు ఖర్చు పెట్టుకుని ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– పద్మ, బుజబుజనెల్లూరు

జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి



మా ప్రాంతంలో ఎక్కువగా జ్వరాలున్నాయి. పెద్దాస్పత్రికి వెళ్తే మందులు రాసి పంపుతున్నారు. సెలైన్ కూడా పెట్టడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే డాక్టర్ ఫీజు, పరీక్షలంటూ కనీసం రూ.3 వేల.. రూ.4 వేలు ఖర్చు పెట్టిస్తున్నారు. దీంతో మాలాంటి పేదలకు ఆర్థికంగా ఇబ్బందికరంగా ఉంది.

– రాజు, ఆటో కార్మికుడు, నెల్లూరు

జ్వరాలు నియంత్రణలోనే ఉన్నాయి

జిల్లాలో జ్వరాలు నియంత్రణలోనే ఉన్నాయి. అక్కడక్కడ జ్వరాలు నమోదవుతున్నాయి. వీటి సంఖ్య పెరగకుండా వైద్యశాఖ పక్షాన ప్రజలను చైతన్యం చేస్తున్నాం. దోమలు కుట్టకుండా , పుట్టకుండా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడైనా డెంగీ, మలేరియా కేసులు నమోదైతే ఆ ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య రక్షణ చర్యలు చేపట్టడమే కాకుండా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. రోగులకు అవసరమైన మందులు సిద్ధంగా ఉన్నాయి. ఎక్కడైనా రోగులను సక్రమంగా పట్టించుకోలేదని ఫిర్యాదులు వస్తే అలాంటి చోట్ల విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటాం.

– సుజాత, డీఎంహెచ్‌ఓ

గురుకుల పాఠశాలలో పారిశుధ్య చర్యలు

ఆత్మకూరు: స్థానిక ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థినులకు జ్వరాలు పడిన నేపథ్యంలో ఆదివారం మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. గురుకుల పాఠశాల పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొనడంతోనే ఈ పరిస్థితికి కారణమని గుర్తించిన అధికారులు హాస్టల్ గదుల్లో దోమలను నిర్మూలనకు ఫాగింగ్ చేపట్టారు. ఆవరణలోని నీటి మడుగులను పూడ్చేశారు. పాఠశాల వెనుక వైపు ప్రహరీ సమీపంలోని మురుగు నీటిని జేసీబీ యంత్రాలతో బయటకు వెళ్లేలా కాలువ తవ్వారు. విష పురుగులు, దోమలు రాకుండా బ్లీచింగ్ చల్లడంతోపాటు మలాథియాన్ స్ప్రే చేశారు. మురుగునీటిని మరో కాలువ ద్వారా దారి మళ్లించారు.

ఇతర హాస్టళ్లలోనూ

గురుకుల పాఠశాల పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన క్రమంలో పట్టణంలోని హిల్‌రోడ్డులో ఉన్న బాలికల హాస్టల్, బాలుర హాస్టళ్లలో మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించారు. బాలికల హాస్టల్‌లో తాగునీటి ట్యాంకును శుభ్రపరిచి పరిసరాల్లో బ్లీచింగ్ చల్లారు. హాస్టల్ ఆవరణలోని చెత్తను పూర్తిగా తొలగించి బ్లీచింగ్ చెల్లించారు.



ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ఫాగింగ్ చేయిస్తున్న దృశ్యం

ఫీవర్ సర్వేలకు స్వస్తి

గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు క్రమం తప్పకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సచివాలయం వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేసే వారు. ఒక వీధిలో ముగ్గురికి జ్వరాలు కనిపిస్తే ఆ ప్రాంతంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి మందులు అందించే వారు. జ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పి అవగాహన కల్పించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఫీవర్ సర్వేలు లేవు. మెడికల్ క్యాంపులు లేవు. తాజాగా ఆత్మకూరులోని గురుకుల పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థినులు ఏకకాలంలో జ్వరాల బారిన విషయం బయటకు పొక్కడంతో జిల్లా అధికార యంత్రాంగం అంతా హడావుడి చేస్తోంది.

నవోదయ ప్రిన్సిపల్ కిరాతకం

- రక్తం కారేలా విద్యార్థిని కొట్టి, ఆపై బాత్‌రూమ్‌లో నిర్బంధం
- తలుపులు తెరవొద్దని టీచర్లకు హెచ్చరిక
- ఆర్తనాదాలతో చలించి ఆస్పత్రికి తరలించిన ఉపాధ్యాయులు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు
- తీవ్రంగా స్పందించిన తల్లిదండ్రులు
- ప్రిన్సిపల్‌పై సస్పెన్షన్ వేటు



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న విద్యార్థి సంఘ నాయకులు

మర్రిపాడు: మండలంలోని కృష్ణాపురంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పెత్తన స్వామి కిరాతకం బయటపడింది. క్రమశిక్షణ పేరుతో విద్యార్థులను వేధిస్తున్న ప్రిన్సిపల్ తాజాగా 6వ తరగతి విద్యార్థి పరకాయల మహేష్ బాబుని విచక్షణా రహితంగా కొట్టి తీవ్రంగా గాయపరిచిన ఘటన శనివారం రాత్రి జరిగింది. విద్యార్థిని రక్తం కారేలా కొట్టి, బాత్‌రూమ్‌లో నిర్బంధించిన దారుణం సంచలనం సృష్టించింది. మహేశ్‌ను వాష్ రూమ్‌లోకి తీసుకెళ్లి తలను గోడకేసి కొట్టడంతో తీవ్ర గాయమై రక్తం కారింది. అయినా కనికరించని ప్రిన్సిపల్, వాష్‌రూమ్‌లో పెట్టి బయట నుంచి గడియ పెట్టారు. బాధతో కేకలు వేస్తున్నా.. తలుపులు తెరవొద్దని ఉపాధ్యాయులను హెచ్చరించారు. మహేశ్ ఆర్తనాదాలతో చలించిపోయిన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వెంటనే వాష్‌రూమ్ తలుపులు తెరిచి రక్తస్రావమవుతున్న విద్యార్థిని కారులో మర్రిపాడు పీహెచ్‌సీకి తరలించారు. పాఠశాలలో ఇలాంటి దారుణం జరగడంపై విద్యార్థి తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రిన్సిపల్ సస్పెన్షన్

మహేష్‌బాబు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మర్రిపాడు పోలీసులు ప్రిన్సిపల్‌పై కేసు నమోదు చేశారు. ప్రిన్సిపల్ దాష్టీకంపై సంబంధిత అధికారులు స్పందించారు. విద్యార్థిపై కర్కశంగా దాడికి పాల్పడిన ప్రిన్సిపల్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ప్రిన్సిపల్ రౌడీలాగా వ్యవహరించారు

నవోదయ పాఠశాలలో విద్యార్థిపైన కర్కశంగా ప్రవర్తించిన ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రౌడీలాగా దాడి చేయడం ఏమిటని ఆంధ్ర విద్యార్థి సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మహంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రిన్సిపల్ తీరు గర్హనీయమని, ఆయపై కఠిన చర్యలు తీసుకోవాలని మరో విద్యార్థిని తండ్రి చంద్ర నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నవోదయ యాజమాన్యంతోపాటు పోలీసులు కఠినంగా వ్యవహరించాలని దొడ్డవరపు విజయమోహన్‌రావు పేర్కొన్నారు.

నెల్లూరు, పల్నాడు కలెక్టర్లుగా బాధ్యతలు స్వీకరిస్తున్న హిమాన్షు శుక్లా, కృతికా శుక్లా (ఫైల్)





కలెక్టర్లుగా దంపతులకు గౌరవం

- ఒకే రోజు నెల్లూరులో భర్త, పల్నాడులో భార్య బాధ్యతల స్వీకారం

నెల్లూరు (అర్బన్): ఐఏఎస్ సాధించడానికి ఎంతో మంది ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ఎక్కువ మంది విఫలమవుతారు. అతి కొద్ది మంది మాత్రమే సక్సెస్ అవుతారు. ఐఏఎస్‌కు సెలక్ట్ అయిన వారు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించే అవకాశం దక్కడం, పని చేయడం గొప్ప గౌరవం. అయితే ఐఏఎస్ సాధించి వివిధ హోదాల్లో పనిచేసిన ఇద్దరు భార్యాభర్తలు ఒకే రోజు చెరొక జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగాని, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కానీ ఇప్పటి వరకు చరిత్రలో జరగలేదు. భార్యాభర్తలు ఇద్దరూ ఐఏఎస్‌లుగా ఎంపికైనప్పటికీ ఇద్దరూ ఒకే రోజు కలెక్టర్లుగా నియమితులు కాలేదు. కానీ ఒకే రోజ్ ఇద్దరు భార్యాభర్తలు రెండు జిల్లాలకు కలెక్టర్లుగా శనివారం బాధ్యతలు స్వీకరించిన అరుదైన గౌరవం నెల్లూరు కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఆయన భార్య పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లాలకు దక్కింది. ఒకరు తొలి ప్రయత్నంలో.. మరొకరు రెండో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించారు. ఒకరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు.. మరొకరు హరియాణకు చెందిన వారు కావడం విశేషం. 2013లో ఐఏఎస్ సాధించిన వారిద్దరూ రాష్ట్రంలో సబ్‌కలెక్టర్లుగా, జేసీలుగా, హెచ్‌ఓడీలుగా, ఇతర శాఖల అధిపతులుగా పని చేశారు. ఐఏఎస్ ప్రిపరేషన్ సమయంలో ఇద్దరూ ఇష్టపడి.. పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. రాజకీయంగా సున్నితమైన నెల్లూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఇక్కడ పనిచేయడం అంటే కత్తిమీద సాములాంటిదే. అయితే వివిధ హోదాల్లో పని చేసి మంచి పేరు తెచ్చుకున్న హిమాన్షు శుక్లా జిల్లా కలెక్టర్‌గా తన పాలన తీరుతో ప్రజాభిమానాన్ని చూరగొంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఫ్యాక్షన్ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్న పల్నాడు జిల్లాలో కలెక్టర్‌గా కృతికా శుక్లాకు ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని నిలబడతారో లేదో వేచి చూడాల్సి ఉంటుంది.

ప్రకృతి సంపదను దోచుకోవడమే పని



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీలు చంద్రశేఖరరెడ్డి, మురళీధర్

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

చిల్లకూరు: అభివృద్ధిని గాలికొదిలేసి, ప్రకృతి సంపదను దోచుకోవడమే పనిగా కూటమి ప్రభుత్వం పెట్టుకుందని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి దుయ్యబట్టారు. అక్రమ కేసుల్లో చిక్కుకుని విడుదలైన చిల్లకూరు మండలం మోమిడికి చెందిన వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, ఆయన తల్లి శారదమ్మను కాకాణి ఆదివారం పరామర్శించారు. కాకాణి విలేకరులతో మాట్లాడుతూ ఎంతో ప్రశాంతంగా ఉండే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రోజూ ఎక్కడో ఒక చోట హత్యలు, దాడులు, గంజాయి విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి గతంలో సిలికాలో దోపిడీ జరిగిపోతోందని గగ్గోలు పెట్టారని, ఇప్పుడు ఆయన కోట మండలం కర్లపూడిలో సిలికా మైన్స్‌లు తీసుకునేందుకు వస్తున్నారన్నారు. దీనిని అడ్డుపెట్టుకుని పక్కనే ఉన్న ఏపీఐఐసీ భూముల్లోని సిలికాను తవ్వి తరలించి దోచుకునేందుకు సిద్ధపడుతున్నారని ఆరోపించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలో గ్రావెల్, మట్టి, సిలికా, ఇసుక దోపిడీకి పరాకాష్టగా మారిందన్నారు. నేరుగా ప్రజా ప్రతినిధులే రంగంలోకి దిగి, వారే అక్రమంగా అనుమతులు లేకుండా గ్రావెల్, ఇసుక లేఅవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. దీన్ని స్థానికంగా ఉండే వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై అక్రమంగా కేసులు బనాయించి భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మందిపై రౌడీ షీట్‌లు ఓపెన్ చేస్తున్నారన్నారు. ఒక వేళ ఎవరిపైనా అయినా రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తే తన వద్దకు గానీ, ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తల దృష్టికి గానీ తీసుకొస్తే, వారి పక్షాన నిలబడి పోరాడుతామని చెప్పారు. అక్రమ కేసులు పెట్టిన వారిపై ప్రైవేట్ కేసులు వేసేందుకు కూడా తాము వెనుకాడబోమన్నారు. తిరుపతి జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ సుబ్బారాయుడు పోలీస్ వ్యవస్థను గాడిలో పెట్టి, అక్రమ కేసులు బనాయించకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యానికి డబ్బులివ్వలేదనే ఆగ్రహంతో..

• స్నేహితుడిపై కత్తితో దాడి

నెల్లూరు(క్రైమ్): తాగేందుకు డబ్బులివ్వలేదనే ఆగ్రహంతో స్నేహితుడిపై కత్తితో ఓ యువకుడు విచక్షణరహితంగా పొడిచి పరారైన ఘటన నగరంలోని నిప్పో సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. నిప్పో సెంటర్ సమీపంలోని సాయిబాబా మందిర వెనుక వైపు నివాసం ఉంటున్న శివాజీ.. వేదాయపాళేనికి చెందిన రాము స్నేహితులు. సాయిబాబా మందిరం వద్ద శివాజీ ఉండగా, రాము అక్కడికి చేరుకొని తాగేందుకు డబ్బులివ్వాలని కోరారు. తన వద్ద లేవని చెప్పిన శివాజీపై రాయితో దాడి చేశారు. అనంతరం తన వద్ద ఉన్న కత్తితో శివాజీ ఛాతి కింది భాగంలో బలంగా పొడిచి పరారయ్యారు. తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితికి చేరుకున్న శివాజీని 108లో జీజీహెచ్‌కు స్థానికులు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును వేదాయపాళెం పోలీసులు ఆదివారం నమోదు చేశారు. కాగా దాడి సమయంలో ఇద్దరూ మత్తులో ఉన్నారని తెలిసింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రాందేవ్‌బాబా (ఫైల్)

కోవూరు: గణేశ్ విగ్రహ నిమజ్జన సమయంలో పట్టణంలో బాణసంచా పేలడంతో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాలు.. పట్టణంలో గణేశ్ విగ్రహ ఊరేగింపును ఈ నెల ఐదున నిర్వహించారు. ఆ సమయంలో బాణసంచా కాలుస్తుండగా, మంటలు భారీగా చెలరేగి ఒక్కసారిగా పేలిపోయాయి. ఘటనలో స్థానిక సత్రంవీధికి చెందిన రాందేవ్‌బాబా (25) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయన్ను ఆస్పత్రికి స్థానికులు తరలించి చికిత్సను అందించారు. మృత్యువుతో పోరాడి చివరికి తుది శ్వాసను ఆదివారం తెల్లవారుజామున విడిచారు. పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కమిటీకి చెందిన ఐదుగురిపై ఇప్పటికే కేసును నమోదు చేశారు. ఘటనపై కోవూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



పత్రిక స్వేచ్ఛపై దాడి

ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించకపోతే పత్రిక స్వేచ్ఛపై దాడి చేయడం మంచి పరిణామం కాదు. పత్రికలు రాసే వార్తపై న్యాయపరమైన పోరాటాలు చేయాలే గానీ ఎన్నడూ లేని కొత్త సంప్రదాయాన్ని తీసుకురావడం సమంజసం కాదు. సాక్షి ఎడిటర్‌పైనే పోలీస్ కేసులు నమోదు చేయడం ఆమోదయోగ్యం కాదు. ఇది ముమ్మాటికీ పత్రికలపై దాడిగానే భావించాలి.

– భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి, మనుబోలు



ఎంతమాత్రం తగదు

పత్రికలపై నేరుగా కేసులు పెట్టడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ప్రభుత్వ విధానాలపై పత్రికలు ఎంతో కాలంగా విమర్శనాత్మక కథనాలు రాస్తూనే ఉన్నాయి. సాక్షి ఎడిటర్‌పై పోలీస్ కేసులు పెట్టించడంతో పత్రిక స్వేచ్ఛ ప్రమాదంలో పడినట్లయింది. ఇలాంటి ఘటనలను మూకుమ్మడిగా ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– బాబూమోహన్‌దాస్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా మాజీ సంయుక్త కార్యదర్శి



చికెన్ ధరలు జూమ్

• బ్రాయిలర్ కిలో రూ.260
• ఫారం కోడి మాంసం రూ.200
• కోళ్లు తగ్గిపోవడమే పెరుగుదలకు కారణం
• గ్రామాల్లో రూ.20 అదనం


మాంసం దుకాణం


విక్రయానికి సిద్ధంగా బ్రాయిలర్ కోళ్లు

పొదలకూరు: చికెన్ ధరలు తగ్గి వ్యాపారులు, కోళ్ల పరిశ్రమ నిర్వాహకులు కుదేలవుతున్న తరుణంలో ఒక్కసారిగా రేట్లు పెరిగాయి. బర్డ్ ఫ్లూ, ఇతర అంటువ్యాధులతో కోళ్ల పరిశ్రమ కునారిల్లుతుండగా, ప్రస్తుతం ఊపిరి పోసుకుంటోందని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. బ్రాయిలర్, ఫారం కోళ్ల ధరలు కిలోకు రూ.40 పెరగడంతో మాంసం ప్రియులు ఇబ్బందులు పడుతున్నారు. పొదలకూరు చుట్టుపక్కల మండలాల్లో ఈ పరిశ్రమలు చెప్పుకోదగ్గ స్థాయిలో లేవు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. పెద్ద వ్యాపారాల్లో కోళ్ల అమ్మకాలు ఒకటి కావడంతో మాంసం దుకాణాలు ఆదివారం కిటకిటలాడుతుంటాయి. మండలంలోని మొగళ్లూరు, చాటగొట్ల తదితర గ్రామాల్లో కోళ్ల పెంపకాన్ని స్వల్పంగా చేపట్టి పట్టణంలో విక్రయిస్తున్నారు.

ఒక్కసారిగా..

చికెన్ ధరలు ఉన్నఫళంగా పెరిగాయి. చిత్తూరు తదితర ప్రాంతాల్లో కోళ్ల సంఖ్య తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని వ్యాపారులు తెలిపారు. మొగళ్లూరులో కోళ్ల ఫారం ఉన్న యజమాని ఇటీవల వరకు నష్టాలను చవిచూసి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. గత వారం కిలో బ్రాయిలర్ ధర రూ.210 నుంచి రూ.220 ఉండగా, ఈ ఆదివారానికి రూ.260కు చేరుకుంది. ఫారం కోడి మాంసం రూ.180 ఉండగా, ఇప్పుడు రూ.200 పలుకుతోంది.

ధరలు చూసి విస్తుపోతూ..

చేపల ధరలు బాగా పెరుగుతున్నాయని చికెన్ తింటున్న మాంసాహార ప్రియులు పెరిగిన రేట్లను చూసి విస్తుపోతున్నారు. గ్రామాల్లో కిలోపై రూ.20ను అదనంగా వసూలు చేస్తున్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ కాటాలున్నా, తూకాల్లో తేడాలొస్తున్నాయి. గతంలో లీగల్ మెట్రాలజీ శాఖ వారు చికెన్ దుకాణాలపై దాడులు నిర్వహించి కేసులు సైతం నమోదు చేశారు. ఎలక్ట్రికల్ కాటాలను స్వాధీనం చేసుకున్నారు. తరచూ దాడులు నిర్వహిస్తే తూకాల్లో తేడాలు రావని వినియోగదారులు పేర్కొంటున్నారు.

> **ధరలు బాగా పెరిగాయి**
>
> చికెన్ ధరలు బాగా పెరిగాయి. గత వారంతో పోలిస్తే భారీ వ్యత్యాసం కనిపించింది. కోళ్ల సంఖ్య తగ్గిపోవడం సైతం పెరుగుదలకో కారణం. బయటి జిల్లాల నుంచి కోళ్లు ఆశించిన స్థాయిలో దిగుమతి కావడం లేదు. చుట్టుపక్కల గ్రామాల్లో కోళ్ల పరిశ్రమ లేకపోవడం సైతం ఓ కారణం.
>
> – నారాయణరెడ్డి, వ్యాపారి, పొదలకూరు

అండర్ - 19 ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్కూల్ గేమ్స్ అండర్ – 19 ఫుట్‌బాల్ జట్లను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం ఎంపిక చేశారు. కర్నూలులో ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్ – 19 స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ పాటూరు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

‘చంద్రబాబు నోరు తెరిస్తే అబద్ధాలే’

ఉదయగిరి: సీఎం చంద్రబాబుకు మతిభ్రమించిందని, నోరు తెరిస్తే అబద్ధాలే వస్తున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాలలకు నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసి.. ఐదింటిని పూర్తి చేశారని వివరించారు. ఇప్పటికే అక్కడ విద్యార్థులు చదువుకుంటున్నారని, అయితే అనంతపురంలో ఇటీవల నిర్వహించిన సభలో సీఎం అన్నీ అబద్ధాలు చెప్పారని విమర్శించారు. దీంతో సభకు వెళ్లిన టీడీపీ కార్యకర్తలు సైతం ఆశ్చర్యపోయారన్నారు. మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ఆయన అనుచరులకు కట్టబెట్టేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి ముఖ్యమంత్రికి కనిపించడంలేదని విమర్శించారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికలకు ముందు ఊదరగొట్టి.. అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. అనేక మంది అర్హులకు తల్లికి వందనం, పింఛన్లు, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు రావడంలేదన్నారు. అబద్ధాలు చెప్పకుండా సుపరిపాలనను అందించాలని హితవు పలికారు.

నడిరోడ్డుపై ఇరువర్గాల దాడులు

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాల నేపథ్యంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఘటన నగరంలోని ఎల్ఐసీ కార్యాలయ సమీపంలోని రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన లావణ్య, నరేష్ దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రామ్‌నగర్‌లోని తన పెద్దమ్మ కామాక్షి ఇంటికి లావణ్య వచ్చారు. అదే సమయంలో నరేష్ కుటుంబసభ్యులు సైతం అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల నడుమ మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు. అనంతరం దర్గామిట్ట పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

• నేటి నుంచి ఆందోళనలకు సిద్ధం

నెల్లూరు సిటీ: రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో జరుగుతున్న సాఫ్ట్‌వేర్ మార్పులతో జిల్లాలోని డాక్యుమెంట్ రైటర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్యలకు పరిష్కారం లభించేంత వరకు సోమవారం నుంచి పెన్‌డౌన్ చేస్తున్నామని దస్తావేజుల లేఖరుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు, డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెల్లూరు సిటీ అధ్యక్షుడు బాలవెంకటఅశోక్ ప్రకటించారు.

ఇవీ సమస్యలు..

• ఇంతకుముందు పబ్లిక్ డేటా ఎంట్రీలో జరిగే తప్పులను సబ్ రిజిస్ట్రార్లు సరిదిద్దే అవకాశం ఉండేది. అయితే తాజా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లో ఆ సౌకర్యాన్ని తొలగించడంతో చిన్న పొరపాటు జరిగినా ప్రక్రియను మళ్లీ ప్రారంభం నుంచే చేయాల్సి వస్తోందంటున్నారు.

• డేటా ఎంట్రీలో తప్పుల కారణంగా తిరిగి నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే క్రయదారుల నుంచి ఓటీపీలను పదేపదే సేకరించడం కష్టమవుతోందని లేఖరులు తెలిపారు. ఒకసారి పొరపాటు జరిగితే మొత్తం డేటాను మళ్లీ నమోదు చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు

• దస్తావేజులోని స్థల విస్తీర్ణం, ఇంటి పన్ను రసీదులో ఉన్న విస్తీర్ణం మధ్య తేడాలుంటే వాటిని రిజిస్ట్రేషన్ చేయకుండా సబ్ రిజిస్ట్రార్లు వెనక్కి పంపుతున్నారని లేఖరులు పేర్కొంటున్నారు.

యూపీహెచ్‌సీ ఉద్యోగులకు భద్రత కల్పించాలి


నూతన కార్యవర్గం

నెల్లూరు(అర్బన్): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రతను కల్పించాలని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింహాచలం, గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లాలోని 28 యూపీహెచ్‌సీ ఉద్యోగులతో నగరంలోని బాలాజీనగర్‌లో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే మెరుగైన జీతాలతో పాటు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేస్తామని హామీ ఇచ్చి.. ప్రస్తుతం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఎఫ్‌ఆర్ఎస్ యాప్‌లో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించకుండా చిరుద్యోగుల జీతాల్లో కోత విధిస్తామంటూ ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమని చెప్పారు. వివిధ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను చేపడతామని స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్, 104 ఉద్యోగుల ప్రెసిడెంట్ వాసు, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

ఈ సందర్భంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సాయితేజ, రూపేంద్ర, వర్కింగ్ ఉమెన్ ప్రెసిడెంట్‌గా స్రవంతి, కోశాధికారిగా శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెన్నకేశవ, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్‌గా పవన్, ఉపాధ్యక్షులుగా కవిత, స్రవంతి, జాయింట్ సెక్రటరీలుగా అఫ్రోజ్, ప్రసాద్, నాగరాజమ్మ తదితరులను ఎన్నుకున్నారు.



ఆటో కార్మికులను రోడ్డున పడేశారు


దుత్తలూరులో సీఐటీయూ నేతల ర్యాలీ

దుత్తలూరు: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంతో రాష్ట్రంలోని 15 లక్షల ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. దుత్తలూరులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ నాలుగో మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఆటో, విద్యుత్, మినీ అంగన్‌వాడీ కేంద్రాల కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగంలో నష్టపోయిన కార్మికులకు ఏటా రూ.25 వేల చొప్పున అందించాలని కోరారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 18న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు. సీఐటీయూ నేతలు హజరత్తయ్య, సురేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సిగ్గుతో ప్రభుత్వ పెద్దలు తలదించుకోవాలి


మాట్లాడుతున్న రామచంద్రయాదవ్


హాజరైన రైతులు

ఉలవపాడు: కరేడులో రైతులపై జరుగుతున్న అరాచకానికి ప్రభుత్వ పెద్దలు సిగ్గుతో తలదించుకోవాలని బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ విమర్శించారు. కరేడులో ఆదివారం నిర్వహించిన భూసేకరణ వ్యతిరేక బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులను కలిసేందుకు కోర్టు నుంచి అనుమతి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఇక్కడ ఏర్పడిందని ఆరోపించారు. రాజ్యాంగ హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. శాంతి భద్రతలను పరిరక్షించాల్సింది పోయి అరాచక ప్రభుత్వానికి అండగా ఉంటున్నారని ధ్వజమెత్తారు. లక్షలాది ఎకరాల భూములు తీసుకోవడం తప్ప అభివృద్ధి మాత్రం జరగడంలేదన్నారు. రైతులకు అండగా నిలబడితే కేసులు పెట్టి వేధించడాన్ని మానుకోవాలని హితవు పలికారు. రైతులకు అండగా ఉంటామని ప్రకటించారు.

పిస్టల్‌తో కాల్చేయండి..

ఉప్పరపాళెం నుంచి కరేడు ఉద్యమ కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో రైతులను పోలీసులు అడ్డుకున్నారు. ఆ సమయంలో ఉప్పరపాళేనికి చెందిన ఓ రైతు మీ దగ్గర ఉన్న పిస్టల్‌తో కాల్చేయండి.. ఇలా ఎంత కాలం అడ్డుకుంటారంటూ సీఐ అన్వర్‌బాషాను ప్రశ్నించారు. రైతు ఉద్యమ నేత మిరియం శ్రీనివాసులు, సీపీఎం నేత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు చేరుకున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): ఎస్పీగా నియమితులైన అజిత వేజెండ్ల.. నెల్లూరుకు ఆదివారం చేరుకున్నారు. పోలీస్ కవాతు మైదానంలోని అతిథి గృహంలో బస చేశారు. ఆమెను ఏఎస్పీ, డీఎస్పీ, సీఐలు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. కాగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలను సోమవారం స్వీకరించనున్నారు.

దుర్గంపల్లి అడవుల్లో నాటుసారా తయారీ

ఉదయగిరి: ఉదయగిరి సమీపంలోని దుర్గంపల్లి అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్న ఆనవాళ్లు ఆదివారం వెలుగులోకి వచ్చాయి. దుర్గంపల్లికి వెళ్లే మార్గంలో హనుమాన్ నాలా సమీపంలో గల అడవుల్లో సారా బట్టీని గుర్తుతెలియని వ్యక్తులు ఏర్పాటు చేసి తయారు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. వీటి తయారీకి ఉపయోగించే ముడి సరుకు, రెండు డ్రమ్ము ల్లో ఊట, ఇతర సామగ్రి కనిపిస్తున్నాయి.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): బస్సు ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న వృద్ధుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాలు.. పొగతోటలో నివాసమంటున్న తిరుపాల్ (78) తన ఇంటి నుంచి శనివారం సాయంత్రం బయటకొచ్చారు. వెంకటరమణ హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా, ఆర్టీసీ నుంచి యల్లాయపాళేనికి వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఆయన్ను వేగంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. విషయాన్ని కుటుంబసభ్యులకు స్థానికులు తెలియజేశారు. ఘటన స్థలానికి వారు చేరుకొని తిరుపాల్‌ను చికిత్స నిమిత్తం 108లో నారాయణ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు సౌత్ ట్రాఫిక్ పోలీసులకు మృతుడి కుమారుడు వెంకటరత్నం ఆదివారం ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు




పెద్దవి:	రూ.40
సన్నవి:	రూ.25
పండ్లు:	రూ.15

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.150
లేయర్	రూ.115
బ్రాయిలర్ చికెన్:	రూ.264
స్కిన్‌లెస్ చికెన్:	రూ.290
లేయర్ చికెన్:	రూ.195



మహిళా సంరక్షకురాలి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళా సంరక్షకురాలు తన ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళెంలోని ఎల్ఐసీ కాలనీలో నివాసం ఉంటున్న జయరాజు చిన్నకుమార్తె పద్మ ప్రియదర్శిని (29) బుజబుజనెల్లూరు దివ్యాంగుల కాలనీలో గల సచివాలయంలో మహిళా సంరక్షకురాలిగా పనిచేస్తున్నారు. ఇంట్లో ప్రియదర్శిని ఉండగా, ఆమె తల్లి, అక్క పని నిమిత్తం శుక్రవారం బయటకెళ్లారు. అనంతరం వీరు ఇంటికొచ్చి చూడగా బెడ్‌రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ప్రియదర్శిని ఉరేసుకొని వేలాడుతూ కనిపించారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానికుల సహకారంతో వనంతోపు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు మృతురాలి అక్క సుప్రజ ఫిర్యాదు చేశారు. హాస్పిటల్‌కు పోలీసులు చేరుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేశారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


అలీం (ఫైల్)

కోవూరు: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. కార్పెంటర్‌గా పనిచేసే చిన్నపడుగుపాడుకు చెందిన అలీం (38) మద్యానికి బానిసయ్యారు. సంపాదించిన మొత్తాన్ని దీనికే వెచ్చించసాగారు. అనారోగ్య సమస్యలూ వెంటాడటంతో గతంలో పలుమార్లు ఆత్మహత్యయత్నాలకు పాల్పడ్డారు. ఈ తరుణంలో భార్య అస్మత్, ఇద్దరు కుమారులను తీసుకొని శనివారం రాత్రి బయటకెళ్లారు. తిరిగొచ్చేసరికి ఫ్యాన్ హుక్‌కు లుంగీతో ఉరేసుకొని ఉండటాన్ని గమనించారు. వెంటనే ఆయన్ను భార్య, పిల్లలు కిందికి దింపి 108లో కోవూరు పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. మద్యం అలవాటు, అనారోగ్యం, కుటుంబసమస్యలతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. ఘటనపై కోవూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.